# ఈ వారం కథ

రాత్రి సమయం పదకొండు గంటలు కావస్తూంది. భోజనం చేసి కాంపౌండ్‌లో అటూ ఇటూ తిరుగుతున్నాను. కొడుకు, కోడలు సీరియల్స్ చూస్తున్నారు. టి.వి. శబ్దం నా గదిలోకి బిగ్గరగా వినిపిస్తూ వుంటుంది. నిద్ర రాదు. టి.వి. కట్టేసేవరకూ కాంపౌండ్‌లో తిరగటం అలవాటు.

ఎదురింటి ముందు హీరోహోండా వచ్చి ఆగింది. ఎదురింటి కుర్రాడు క్రిందకు దిగకుండానే హారన్ మ్రోగించాడు. వాడి వయస్సు ముప్ఫై సంవత్సరాలకు కొంచెం అటు ఇటు వుండవచ్చు. వాడు తల తిప్పి నావైపు చూశాడు. వాడి ముఖంలో ఓ పలకరింపు లేదు. చిరునవ్వు లేదు. ఓసారి నావైపు చూసి గేటు వైపు తల తిప్పాడు. బ్లాక్ ఫ్యాంట్ మీద చారల చొక్కా, చేతులు పైకి మడిచి, గొంతు క్రింద మొదటి బటన్ వదిలేసి, రేగిన జుట్టుతో ఏదీ పట్టనట్లు వుంటాడు. ఎప్పుడూ అంతే.

ఆ కుర్రాడి అమ్మ వచ్చి గేటు తీసింది. అలాగే లోపలికి దూసుకెళ్ళి కాంపౌండ్ లోపల బండి నిలిపి దిగాడు. ఆ కుర్రాడు రోజూ ఇల్లు చేరే సమయం ఇదే. రోజూ చూస్తున్నదే. ఉదయం నేను పళ్ళు తోముకుంటుండగా హోండాలో వెళ్ళిపోతాడు. రాత్రి పదకొండు గంటలకు ఇల్లు చేరుతాడు. సెలవు రోజుల్లో కూడా అంతే. అంత ఉద్ధరించే పనులేముంటాయో అర్థంకాదు.

నా కొడుకూ ఉద్యోగం చేస్తున్నాడు. ఉదయం వెళ్ళి సాయంకాలానికి ఇల్లు చేరుతాడు. సెలవు దినాల్లో ఇంటి పట్టునే వుంటాడు. కానీ ఇంటి పట్టునుండకుండా సెలవు దినాల్లో కూడా వీధుల్లో పడి తిరగటమే వాడి ఉద్యోగంలా వుంది. పక్కింటి రామారావుగారిని అడిగితే వాడి పేరు 'అనంతే'అని మాత్రం తెలిసింది. వాడి వివరాలేవీ ఆయనకు తెలియవన్నాడు. ఇరుగుపొరుగువారిని ఎదుట పడినా పలకరించని వాడి గురించి ఎలా తెలుస్తుంది? మా అబ్బాయి నవీన్ పేరు, చేస్తున్న ఉద్యోగం చుట్టూ పాతిక ఇళ్ళకు తెలుసు. నవీన్ అనంత్‌లా మట్టిముద్ద కాదు. మా నవీన్‌కీ అనంత్‌కి నక్కకూ నాగ లోకానికీ వున్న తేడా వుంది. మా వాడికి ఎలాంటి దురలవాట్లు లేవు.

నలుగురిలో కలిసి పోవటం, ఒక్కసారి పరిచయమైతే చాలు మళ్ళీ మళ్ళీ పలకరించటం మావాడి నైజం. నా కొడుకును నేను చాలా శ్రద్ధ తీసుకుని పెంచాను. ఉద్యోగస్థుడిని చేసాను. వాడు అనంత్‌లా ఊరిమీద పడి వుండడు. ఇంట్లో వుంటాడు కానీ నన్ను పలకరించే తీరిక లేదు. టి.వి.తో బిజీగా వుంటాడు.


ఈమధ్య మనస్సు ఏమీ బావుండటం లేదు. నా పరిస్థితి చాలా ఘోరంగా తయారైంది. మనిషికి తిండి వుంటే సరిపోదు. కొంతయినా ప్రేమ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలి. ఇంత కాలం సర్వస్వతంత్రుడిగా జీవించిన నేను నేడు ముసలితనంవల్ల స్వాతంత్ర్యం కోల్పోయాను.

నాలుగురోజులుగా పంటి నొప్పితో బాధపడుతున్నాను.

ఉదయం నవీన్‌తో "పన్ను సలుపుతోందిరా! ఈ బాధ పడలేకున్నా" అన్నాను. ఆ మాటకు పక్కనే ఉన్న కోడలు ముఖం చిటపట లాడటం నా దృష్టిని దాటిపోలేదు.

వాడు ఓసారి భార్యవైపు చూసి, తలవంచుకుని "ఇదీ ఓ సమస్యేనా! పన్ను నొప్పిదేముంది, తాంబూలం వేసుకు పుక్కిలించేస్తే పోతుంది. దవడన పొగాకు పెట్టుకో. తగ్గిపోతుంది. అంత మాత్రానికి హాస్పిటల్‌కెందుకు. డబ్బు దండగ"అని చెప్పి వెళ్ళిపోయాడు.

వాడి మాటలకు హృదయం విలవిలలాడింది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. పంటి నొప్పి పోగొట్టుకోవడానికి నేను చేయని స్వంత వైద్యం లేదు. దేనికీ తగ్గలేదు. డాక్టర్ దగ్గరకెళ్ళటమొక్కటే మిగిలి వుంది. కానీ ఆ విషయం వాడితో అనలేదు. ముసలివాడికి అన్నమే దండగనుకునే వాళ్ళు జబ్బులకు డబ్బులు ఖర్చుపెడతారా?



# నేను సైతం...

**- డి.కె.చదువులబాబు**

కొడుకు, కోడలు, పిల్లలు టూత్‌పేస్టు వాడితే నేను మాత్రం వాడేది బొగ్గు పొడి. ఏరోజూ పేస్టు వాడమని అనలేదు. పంటి నొప్పితో పేస్టు వాడబోతే కోడలి ముఖంలో చిటపటలు. వేప పుల్ల దొరకనిచోట బొగ్గు తప్ప ఏముంది? ఇంటి ఆర్థిక స్థితికి ఏ లోటూ లేదు. కానీ నేను ఉక్కకు ఉడికిపోతున్నా ఫ్యాన్ వేసుకునే అర్హత లేదు. ఆకలితో కడుపు నకనకలాడిపోతున్నా అడగటానికి లేదు. కోడలు పెట్టినప్పుడు తినాల్సిందే. ఏ రోగంలేకున్నా పిల్లల్ని తాకడానికి లేదు. ఏ జబ్బు అంటుకుంటుందోనని భయం. నేను జేబులో డబ్బులేకుండా ఏరోజూ గడపలేదు. ఈనాడు పిల్లలకు ఓ రూపాయి ఇద్దామన్నా నావద్ద లేదు.

పిల్లలు డబ్బడిగితే ఇచ్చి ఆ కళ్ళలో మెరుపు చూడాలని ఎంతో ఆశ. తనవద్ద డబ్బుండదని తెలిసి అడగటం మానేశారు. పిల్లలను స్పర్శించాలని నా హృదయం ఎంతగానో తపిస్తూంది. ఆ తపన తీరేదెలా?

నా కొడుకును ఈ చేతులతో నా గుండెలపై ఆడిస్తూ మాటలు నేర్పాను. నేడు ఇంట్లో నాతో మాట్లాడేవాళ్ళు లేరు. ఓ పలుకు లేదు. పిలుపు లేదు. చదువుకోసం పిల్లల పరుగులు. కొడుకు ఉద్యోగం, ఇంటికొస్తే భార్య, టి.వి.తో కాలక్షేపం. టి.వి. గుర్తుంటుంది కానీ గదిలో నాన్న ఉన్నాడు పలకరించాలని గుర్తుండదు. ఫ్యూజుపోయిన బల్బుతో పనేముంది? మౌనమే నా నేస్తం. జీవితంలో ఒంటరితనాన్ని మించిన భయంకరమైనదేదీ లేదు. ఆ విషయం వీళ్ళెప్పుడు గుర్తిస్తారు. పొరపాటున చేతులు వణికి నీళ్ళు ఒలికినా కోడలు మాటలతో ప్రాణం తీస్తుంది. జన్మనిచ్చిన తల్లిదండ్రులకోసం పది రూపాయలు ఖర్చు పెట్టాలన్నా మనసొప్పక దండగనుకునే స్థితి.

నా పరిస్థితే ఇలా వుంటే ఉదయం వెళ్ళి ఏ అర్థరాత్రో ఇల్లుచేరే అనంత్ వాడి అమ్మను ఏం చూసుకుంటాడు? ఆమె పరిస్థితి నాకంటే మెరుగ్గా ఏమీ వుండదు. చాలామంది పెద్దవాళ్ళ పరిస్థితి ఇళ్ళలో ఇలాగేవుంది. భగవంతుడు కనిపిస్తే "మానవ సంబంధాలు ఎందుకిలా మారిపోయాయి. మానవత్వం, మానవీయతల చిరునామా ఎక్కడ?"అని అడగాలని వుంది.

ఓసారి మార్కెట్‌కెళ్ళి కూరగాయలతో తిరిగి వస్తున్నాను. రోడ్డుపక్కన హోండా ఆపి ఎవరితోనో మాట్లాడుతూ కనిపించాడు అనంత్. బ్లాక్ ఫాంట్, పైకి మడిచిన చారల చొక్కా, రేగిన జుట్టు. నావైపు చూశాడు. ఆ చూపులో అదే నిర్లక్ష్యం. ఎవరో అపరిచితుడ్ని చూసినట్లు తల తిప్పేసుకున్నాడు. వాడికి బరువు బాధ్యతలు తెలియవు. మంచి చెడులు తెలియవు. ఇరుగుపొరుగు వారిని కనీసం పది రోజులకు ఒకసారైనా పలకరించాలని కూడా తెలియదు. సభ్యత సంస్కారం తెలియవు. మరి జీవించడమెందుకు? తిని తిరగటానికా?

ఆలోచనలతో ఇల్లు చేరాను.

ఆరోజు సాయంకాలం కొడుకు, కోడలు, పిల్లలు హోండాలో సినిమాకు బయలుదేరారు. ఎదురింటి కాంపౌండ్‌లో అనంత్ భార్య పూలు కోస్తోంది. ఆమెను చూస్తే నాకు జాలేస్తుంది. ఆమె భర్తతో కలిసి బయటికెళ్ళగా ఏనాడూ చూడలేదు. ఆమె ఇంట్లో పడివుంటే అనంత్ మాత్రం పండగరోజు, ఆదివారం అనేది లేకుండా జల్సారాయుడిలా వీధుల్లోకి వెళ్ళిపోతాడు. ఆమె ఎలా భరిస్తోందో అనిపించింది. కానీ ఆమె ముఖంలో ఎక్కడా విషాద ఛాయలు లేవు. ప్రశాంతంగా కనిపిస్తుంది. పూలకోసం ఆమె ఇంటి దగ్గరకొచ్చే వాళ్ళతో నవ్వుతూ మాట్లాడుతూ వుంటుంది.

రాత్రి పది గంటలకు నవీన్, కోడలు, పిల్లలు వచ్చారు. అన్నం పెడితే తిని పడుకున్నాను.

మరుసటిరోజు ఉదయం నవీన్ నా దగ్గరకొచ్చాడు. "నాన్నా నీతో ఓ విషయం మాట్లాడాలి"అన్నాడు. ప్రశ్నార్థకంగా చూశాను.

"మీ కోడలికి ఓ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఇద్దరం పనిచేస్తే డబ్బు బాగా సంపాదించవచ్చు" అన్నాడు.

కోడలు ఉద్యోగం చేయాల్సిన అవసరమేంటో నాకర్థం కాలేదు. ఆ విషయం నాకెందుకు చెబుతున్నాడో అర్థం కాలేదు. వాడి ఆర్థిక స్థితికి ఏ లోటూ లేదు. ధరలు పెరిగి మేమున్న ఇల్లే లక్షల విలువ చేస్తుంది. మంచి జీతం వస్తోంది. పల్లెలో నేను చెమటలు ధారపోసి పంటలు పండించి వాడిని ఈ స్థితికి తెచ్చిన భూమి వుండనే వుంది. ఆ భూమి కౌలు డబ్బులు అందుతున్నాయి. ఆ విషయమే అడిగాను. "ఉద్యోగం వచ్చి మంచి జీతం వస్తుంటే ఎందుకు వదులుకోవాలి?" అన్నాడు.

"నీ ఇష్టం" అన్నాను.

"మేము ఇద్దరం ఆఫీస్‌కు, పిల్లలు స్కూల్‌కి వెళ్తే నువ్వు ఇంట్లో ఒంటరిగా వుండాల్సి వస్తుంది. ఎలా వుంటావు. బోర్ కొడుతుంది. అందుకే ఓ నిర్ణయానికి వచ్చాను" అన్నాడు.

ఏం చెబుతాడోనని నేను ఊపిరి బిగబట్టాను.

ఇప్పుడు మాత్రం నేను ఒంటరిని కానా?

క్షణం తర్వాత అన్నాడు... "వృద్ధాశ్రమంలో చేర్పించాలనుకుంటున్నాను. నీకు ఏదైనా అనారోగ్యంగా వుంటే ఎవరో ఒకరు అక్కడయితే అందుబాటులో వుంటారు..." చెబుతున్నాడు.

నా గుండె క్షణకాలం ఆగి మళ్ళీకొట్టుకుంటున్నట్లుయింది. నెత్తిమీద వెచ్చటి రక్తం గుమ్మరిస్తున్నట్లుంది. గుండె బ్రద్దలౌతూ వుంది. అలాంటి మాట వాడి నోట వినాల్సి వస్తుందని నేను ఏనాడూ అనుకోలేదు. నేను పొలం పనులతో క్షణం తీరికలేకున్నా సమయం కేటాయించి మా నాన్న మంచి చెడ్డలు చూశాను. జీవితంలో ఎన్నో బంధాలు... అభిమానాలు... ఆత్మీయతలు... ఎన్నెన్నో జ్ఞాపకాలు.

వాడికి చిన్న దెబ్బ తగిలినా, ఒళ్ళు కొంచెం వేడిగా అనిపించినా గిజగిజలాడి పోయాను. ఎత్తుకుని డాక్టర్ల చుట్టూ తిరిగాను. నా ఎదను ఆట స్థలంగా చేసి, నా గుండె లబ్...డబ్ శబ్దాలతో మాటలు నేర్పాను. వాడికి భవిష్యత్ సౌధాన్ని నిర్మించటానికి నేను ధారపోసిన స్వేదం, ఏది అడిగినా సమకూర్చటానికి పడిన తపన... ఒక్కో జ్ఞాపకం కళ్ళముందు నిలుస్తూ వుంది. గుండె గాయమై రక్తాశ్రువులు చిందిస్తూ వుంది.

నేనేం మాట్లాడలేకపోయాను. తండ్రిని ఇంట్లో అడ్డుగా, బరువుగా భావిస్తున్న వాడితో... తండ్రిని చివరి వరకూ ఎలా మోయాలని ఇప్పుడే బరువు దించుకోవటానికి మార్గం వెదుకుతున్న వాడితో ఏం మాట్లాడను? వాడు చెప్పే కారణం ఏదైనా వాళ్ళ ఉద్దేశ్యం నన్ను ఇంట్లో లేకుండా చేయటమే... నా బరువు బాధ్యతలను తప్పించుకోవటమే! అది వాడి ఆలోచనో, కోడలి మంత్రాంగమో ఏమైనా నేను ఆశ్రమానికి వెళ్ళిపోవాలి.

"నీవు వచ్చి చేర్చాల్సిన అవసరం లేదు. నేనే వెళ్ళి చేరిపోతా?" అన్నాను. నా గుండెల్లో బడబాగ్ని జ్వలిస్తోంది.

ఆ రాత్రంతా నిద్ర లేదు. పిడికిళ్ళు విప్పని వాడి రూపం, బోసి నవ్వులు, ప్రతి రోజూ వాడితో నేను గడిపిన గంటలు, వాడి భవిష్యత్‌కోసం పడిన శ్రమ... ఒక్కో జ్ఞాపకం నాటినుండి నేటిదాకా నా కళ్ళ కన్నీరులో కదిలి కంటి కొసల నుండి జారిపోతున్నాయి. నా కన్నీటితో దిండు తడిసిపోయింది.


తెల్లవారుతూంది. పక్షుల కిలకిల రావాలు, పుష్ప వికసితాలు ఎక్కడున్నాయి? పక్షులు, పుష్పాలు షోకేష్‌ల్లో బొమ్మల్లా మారుతున్నాయి. నా బట్టలు సర్దుకుని సూట్‌కేష్‌తో బయటకు నడిచాను. ఎప్పుడో దారిలో దొరికితే ఖర్చుచేయకూడదని తెచ్చి బట్టల మధ్య ఉంచిన ఇరవై రూపాయల నోటు మాత్రం నావద్ద వుంది.

ఎదురింటి అనంత్ హోండా స్టార్ట్ చేస్తున్నాడు. నావైపు చూశాడు. లిఫ్టు ఇస్తానని కూడా అనలేదు. తల తిప్పేసుకున్నాడు. ఆ చూపులో దేన్నీ పట్టించుకోని అదే నిర్లక్ష్యం. వాడి అమ్మకూడా ఏదో ఒకరోజు అనాథలా ఆశ్రమానికి చేరాల్సిందే అనిపించింది.

ఆటోస్టాండు వైపు నడిచాను. ఆటోవాలాను ఆశ్రమాల వివరాలడిగాను. "నెలనెలా డబ్బుకడితే ధనవంతుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించే ఆశ్రమాలున్నాయి. ఏమీలేని అనాధలకోసం స్వచ్ఛందంగా స్థాపించిన "విశ్వంభర" ఆశ్రమం వుంది. ఎక్కడికెళ్ళాలి?" అన్నాడు.

'విశ్వంభర' అనాధల ఆశ్రమానికి వెళ్ళటానికి నిర్ణయించుకున్నాను.

పట్టణం వెలుపలనున్న ఆశ్రమం ముందు ఆటో ఆగింది. ఆటో ఛార్జి ఇచ్చి లగేజితో లోపలికెళ్ళాను.



నా కళ్ళముందు కమ్ముకుపోయిన తెరలు నెమ్మదిగా తొలగిపోతున్నట్లు... కారు మబ్బుల మధ్య కాంతి కిరణం తొలగి చూసినట్లు... నా మూర్ఖపు ఆలోచనల చీకట్లను తొలగిస్తూ కాంతి పుంజంలా... తన జీవిత కాలాన్నంతా అనాధలకోసం అర్పించిన భానుడిలా అనంత్... ఫోటోను చూస్తూ ఎంతసేపుండియానో!

ఎంట్రన్స్ దాటాక మేనేజర్ రూం కనిపించింది. లోపలికెళ్ళి కలిశాను. ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి. ఆశ్రమంలో చేరిపోయాను.

సువిశాలమైన స్థలంలో గదులు... పచ్చని చెట్లు... అరుగులు... చుట్టూ ప్రహరీ, చల్లని గాలి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. మరికొన్ని గదులు నిర్మాణ దశలో వున్నాయి. ఆశ్రమం ఎందరో వృద్ధులకు నీడనిస్తూ కల్పవృక్షంలా వుంది.

ఆశ్రమం అంతటా కలియ తిరిగాను. అక్కడికి కొద్ది దూరంలో అనాథ పిల్లలకోసం గదులున్నాయి. ఎందరో పిల్లలు ఆ బడికి చేరుకుని చదువు సంధ్యలతో, కడుపు నిండా 'తిండితో మంచి జీవితాన్ని గడుపుతున్నారు. వృద్ధులు, పిల్లల ముఖాల్లో ఆనందం, ప్రశాంతత. బాధ అనేది మచ్చుకైనా కానరాలేదు. వృద్ధులు ఒకరికొకరు తోడుగా అనేక విషయాలు మాట్లాడుకుంటూ ఆ పిల్లల్లో తమ మనవళ్ళను, మనుమరాండ్లను చూసుకుంటూ అందరూ ఎంతో తృప్తిగా కనిపించారు. ఎక్కడా ఒంటరితనం లేదు. మనిషి ఏదైనా పోగొట్టుకోవచ్చు గానీ జీవితం మీద ఇంట్రెస్ట్‌ని మాత్రం పోగొట్టుకోరాదు. అక్కడున్న వారందరూ జీవితంపై ఇష్టంతో ఆనందంగా జీవిస్తున్నారు.

ఒక్కరోజులో అందరితో కలిసిపోయాను.

మరునాడు ఉదయం పేపర్ తిరిగేస్తుంటే కనిపించింది.

'మానవత్వమా! నీ చిరునామా ఎక్కడ?'అనే హెడ్డింగ్. హెడ్డింగ్ పక్కనే ఓ బస్ షెల్టర్‌లో ఇద్దరు వృద్ధులు పడివున్న ఫొటో ఉంది. నా కళ్ళు వేగంగా అక్షరాల వెంట పరుగులు తీస్తున్నాయి. 'ప్రభుత్వ హాస్పిటల్ బయట రోడ్డు పక్కన బస్ స్టాప్ షెల్టర్‌లో ఓ వృద్ధుడి శవం, పక్కనే ప్రాణముండీ కదల్లేని నిస్సహాయ స్థితిలో మరో వృద్ధుడు. శవం కుళ్ళి వాసన వేస్తోంది. శవం పక్కన జీవచ్ఛవంలా మరో వృద్ధుడు పడి వున్నాడు. చూసేవాళ్ళే కానీ ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదు. ఇదీ వార్త సారాంశం.' ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తెస్తూ వార్త ప్రచురించారు. అది చదివి నా మనస్సు కలుక్కుమంది. ఎవరైనా ఆ శవాన్ని దహనం చేసి, వృద్ధుడిని ఆదుకుంటే బావుండుననిపించింది.

మరునాడు పేపర్‌లో 'మానవత్వం పరిమళించిన వేళ'అనే హెడ్డింగ్ కనిపించింది. ఆతృతగా చదవసాగాను.

'విశ్వంభర' ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అనంత్ పత్రికలో వార్తకు స్పందించి వెంటనే హాస్పిటల్ బయట బస్ స్టాప్ షెల్టర్‌లో వున్న వృద్ధుడిని హాస్పిటల్‌లో చేర్చారు. అనాథ శవానికి దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు...' అంటూ అనంత్ సామాజిక సేవా కార్యక్రమాల్ని ప్రశంసిస్తూ వార్త... పక్కనే ఫొటో, ఆ ఫొటోను చూసి పక్కనే బాంబ్ బ్లాస్ట్ అయినట్లు ఉలిక్కిపడ్డాను.

అ... అ... త...ను ఎదురింటి కుర్రాడు అనంత్.

ఉదయమే బయటపడి ఏ అర్థరాత్రో ఇల్లుచేరే అనంత్.

నా కళ్ళముందు కమ్ముకుపోయిన తెరలు నెమ్మదిగా తొలగిపోతున్నట్లు... కారు మబ్బుల మధ్య కాంతి కిరణం తొలగి చూసినట్లు... నా మూర్ఖపు ఆలోచనల చీకట్లను తొలగిస్తూ కాంతి పుంజంలా... తన జీవిత కాలాన్నంతా అనాధలకోసం అర్పించిన భానుడిలా అనంత్... ఫోటోను చూస్తూ ఎంతసేపుండియానో!

మరునాడు ఓ వృద్ధుడిని వెంట తీసుకుని ఆటోలో వచ్చాడు అనంత్. షెల్టరులో శవం పక్కన జీవచ్ఛవంలా పడి వుండి అనంత్ సాయంతో హాస్పిటల్‌లో కోలుకున్న వృద్ధుడిని నడిపించుకుంటూ వస్తున్నాడు అనంత్. నల్ల ఫ్యాంట్‌లో, చారల చొక్కా చేతులు పైకి మడిచి, రేగిన జుట్టుతో దేన్నీ పట్టించుకోకుండా తన లక్ష్యాన్ని, ఆశయాన్ని మాత్రమే చూపుల్లో... అణువణువులో నింపుకున్న అనంత్. ఇద్దరు యువకులు వచ్చి ఆ వృద్ధుడిని గదివైపు తీసుకెళ్ళారు.

ఒకరొక్కరినే ఆప్యాయంగా పలకరిస్తూ వస్తున్నాడు అనంత్. జీవితం మనం జీవించడానికి... మనం సంతోషంగా వుంటూ ఇతరులను సంతోష పెట్టడానికి. జీవితమంటే పని, తిండి, నిద్ర కాదు. కష్టాల్లో ఓదార్పు, సహకారం, మానవత్వం అంటూ జీవితానికి నిర్వచనంలా అనంత్.

నేను నా గదిలోకెళ్ళాను. పెట్టె తెరిచాను. నవీన్‌కు తెలియకుండా వెంట తెచ్చుకున్న పొలం దస్తావేజులు, పట్టా పాసు పుస్తకం తీసుకున్నాను. బయటకొచ్చాను. అనంత్ నా దగ్గరకు వచ్చాడు. ఆత్మీయంగా పలుకరించాడు. దస్తావేజులు, పాసు పుస్తకం అనంత్ చేతిలో పెట్టాను. "లక్షలు విలువ జేసే నా పొలాన్ని 'విశ్వంభర' ఆశ్రమానికి రాయిస్తాను. ఈ ఆశ్రమం అభివృద్ధిలో నేను కూడా పాలుపంచుకునే అదృష్టం ఇవ్వు" అన్నాను.

జీవితమంటే ఏమిటో మరింతగా బోధపడిన క్షణాలు అవి.

★